


# విభారె

తెలుగు దినపత్రిక


VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 06-11-2025 సంపుటి : 07 సంచిక 179 పేజీలు : 8 వెల : రూ 3-00


## జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఏపీ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్



అమరావతి, నవంబరు5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ పై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో అమరావతి సచివాలయంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రుల బృందం సమావేశమైంది. ఈ భేటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి, వంగలపూడి అనిత పాల్గొన్నారు. వర్చువల్‌గా మంత్రి నారాయణ, సత్య కుమార్ యాదవ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై మంత్రులు మాట్లాడుతున్నారు.జిల్లాల విభజన వల్ల ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు జీవోఎం ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే జీఎంవో ప్రాథమికంగా ఇచ్చిన నివేదికపై కొన్ని మార్గదర్శకాలు సీఎం చంద్రబాబు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని ఇప్పటికే జీఎంవో నిర్ణయించింది.ఈరోజు మంత్రుల బృందం సమావేశమై తుది నివేదికను రూపొందించి సీఎం చంద్రబాబుకు మంత్రివర్గ ఉప సంఘం అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జనగణనకు ముందే నివేదిక ఇచ్చేందుకు జీవోఎం ప్రయత్నిస్తోంది.




## ఏపీ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు

అమరావతి, నవంబర్ 5: ఏపీ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. మొత్తం 120 చోట్ల ఏసీబీ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా, కోనసీమ, ఏలూరు, ప్రకాశం, విశాఖ, నెల్లూరు, శ్రీసత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో ఏకకాలంలో రైడ్స్ జరుగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ మేరకు సోదాలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు..అనుమానాస్పదంగా ఉన్న ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లాలోని ఒంగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు రావడం చూసిన కొంత మంది సిబ్బంది..తమ తమ జేబుల్లో ఉన్న నగదు బయటకు విసిరేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు.విశాఖపట్నంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. మధురవాడ, భోగాపురం, టర్నర్ చౌల్ట్రీతో పాటు సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ సోదాలు చేస్తోంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.శ్రీ సత్యసాయి జిల్లాలోని చిలుమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు రైడ్స్ చేశారు. ఇటీవల కాలంలో సబ్ రిజిస్టర్‌పైపలు ఫిర్యాదులు వెల్లడంతో ఏసీబీ రంగంలోకి దిగింది. కార్యాలయం తలుపులు మూసివేసి మరీ ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నారు.ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. కార్యాలయంలో డాక్యుమెంట్స్ ఏసీబీ డీఎస్పీ బీవీ రావు తనిఖీ చేస్తున్నారు.

## ఎస్ఐఆర్‌ను మీరు సపోర్ట్ చేస్తున్నారా, వ్యతిరేకిస్తున్నారా..

### రాహుల్ ఆరోపణలపై ఈసీ

న్యూఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పును బీజేపీ తారుమారు చేసిందని, 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది ఆయన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొంది. హర్యానాలో ఓటర్ల జాబితాపై ఒక్క అప్పీల్ కూడా రాలేదని వివరించింది. హర్యానా ఎన్నికల ఫలితాన్ని బీజేపీ చోరీ చేసిందని, గెలుపు కోసం ఎన్నికల కమిషన్‌తో ఆ పార్టీ కుమ్మక్కయిందని రాహుల్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈసీ తాజా వివరణ ఇచ్చింది.హర్యానాలో కాంగ్రెస్‌కు దక్కాల్సిన అద్భుత విజయాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా 'ఆపరేషన్ సర్కార్ చోరీ' జరిగిందని రాహుల్ ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లు బీజేపీతో కుమ్మక్కయ్యారని అన్నారు. దీనిపై ఈసీ స్పందిస్తూ, 90 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం 22 ఎలక్షన్ పిటిషన్లు మాత్రమే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపింది. బూత్‌లలో ఉన్న కాంగ్రెస్ పోలింగ్ ఏజెంట్ల పాత్రను ఈసీ నిలదీసింది. ఆ పార్టీ పోలింగ్ ఏజెంట్లు ఏం చేస్తున్నట్టు? ఓటరు ఎవరైనా అప్పటికే ఓటు వేసినట్టు అనుమానం వచ్చినా, ఓటరు ఐడెంటిటీపై అనుమానం వచ్చినా అప్పుడే అభ్యంతరం వ్యక్తి చేసి ఉండొచ్చని పేర్కొంది.

**ఎస్ఐఆర్‌పై మీ వైఖరి ఏంటి?:** పౌరసత్వ వెరిఫికేషన్‌తో పాటు డూప్లికేట్లను, చనిపోయిన వారిని, చిరునామా మార్చుకున్న ఓటర్లను తొలగించేందుకు చేపట్టిన ఎస్ఐఆర్‌ను రాహుల్ గాంధీ సపోర్ట్ చేస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? అని ఈసీ ప్రశ్నించింది. కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు ఎందుకు అభ్యంతరాలు లేవనెత్తలేదని ప్రశ్నించింది. ఒకే పేరు పదేపదే




రాకుండా నిరోధించేందుకు రివిజన్ జరిగినప్పుడు కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు అభ్యంతరం చెప్పి ఉండవచ్చని పేర్కొంది. అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 15 వరకూ బిహార్‌లో ఎస్ఐఆర్ సమయంలో కూడా కాంగ్రెస్ ఎందుకు అప్పీల్ చేయలేకపోయిందో చెప్పాలని పేర్కొంది.

**రాహుల్ ఏమన్నారు?:** హర్యానాలో 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని, టాప్-5 ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పినప్పటికీ బీజేపీ గెలిచిందని న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ తెలిపారు. ఒక నియోజకవర్గంలో ఒక ఫోటోతో వంద ఓట్లున్నాయని, అనేక బూతులలో ఫేక్ ఓట్లున్నాయని, అక్రమాలు బయటకు రావద్దని ఎన్నికల సంఘం సీసీటీవీ ఫుటేజ్‌ను డిలీట్ చేసిందని ఆరోపించారు. బ్రెజిలియన్ మోడల్, యూపీ బీజేపీ ఓటర్లు, డూప్లికేట్ ఓటర్లు, ఓటర్ల తొలగింపుతో హర్యానాలో గెలిచారని అన్నారు. యూపీ, హర్యానాలో వేల సంఖ్యల్లో డూప్లికేట్ ఓటర్లున్నారని, యూపీలో ఓటు వేసే వ్యక్తికి హర్యానాలో కూడా ఓటు ఉందని తెలిపారు. బిహార్‌లోనూ ఓట్ల చోరీ జరుగుతుందని, అక్కడ ఎన్నికల తరువాత ఓట్ల చోరీ అంశాన్ని బయటపెడతామని అన్నారు.

## 7వ తేదీ నుంచి ఆపరేషన్‌లోకి నిసార్ ఉపగ్రహం : ఇస్రో చీఫ్

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చైర్మెన్ వీ నారాయణన్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. అమెరికాకు చెందిన నాసాతో కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేసి ప్రయోగించిన నిసార్ ఉపగ్రహం నవంబర్ 7వ తేదీ నుంచి ఆపరేషన్‌లోకి వస్తుందన్నారు. నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రేడార్(ఎన్ఐఎస్ఏఆర్) అత్యంత ఖరీదైన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్. భూ గ్రహంపై ఉన్న మంచు కేంద్రాలను ప్రతి 12 రోజులకు రెండుసార్లు మానిటర్ చేసే సామర్థ్యం ఆ ఉపగ్రహానికి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.జూలై 30వ తేదీన జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఆ శాటిలైట్‌ను ప్రయోగించారు. నిసార్ బరువు సుమారు 2400 కేజీలు. డేటా సమీకరణ పూర్తి అయ్యిందని, నవంబర్ 7వ తేదీన జరిగే భేటీలో శాటిలైట్‌ను అపరేషనల్‌గా ప్రకటించనున్నట్లు నారాయణన్ అన్నారు. ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ సదస్సులో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.నిసార్ శాటిలైట్‌లో రెండు సార్ సిస్టమ్స్ ఉన్నాయి.

## ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలు

**రైతులు రెండు మూడు రకాల పంటలను సాగు చేయాలి**

**పాడి పశువుల పెంపకం తో రైతు బలపడాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



కర్నూలు, నవంబర్, 05 : ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని,అందువల్ల రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రైతులకు సూచించారు. బుధవారం కల్లూరు మండలంలోని పెద్ద టేకూరు, తడకనపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పంటల సాగు ను పరిశీలించి రైతులతో సంభాషించారు. ఈ సందర్భంగా జిల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి పద్ధతుల్లో సాగు చేయడం వల్ల ఖర్చులు తగ్గి, నేల సారవంతం అవుతుందన్నారు.మితి మీరిన విధంగా పురుగు మందులు వాడడం వల్ల ఆరోగ్య పరంగా, పర్యావరణ పరంగా దుష్ప్రభావాలు ఉంటాయని, వాటి వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. నీరు అందుబాటులో ఉన్న పొలాల్లో కాయగూరల వంటి తక్కువ పెట్టుబడి పంటలు సాగు చేస్తే రైతులకు మంచి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారుల వివరాల ప్రకారం, కల్లూరు మండలంలో 16,934 మంది రైతులు మొత్తం 42,033 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇందులో ప్రధానంగా పత్తి, ఉల్లి పంటలు అధికంగా సాగు చేసినట్లు తెలిపారు. పెద్ద టేకూరు గ్రామానికి చెందిన రైతు కోటయ్య శనగ పంటను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు కోటయ్య



మాట్లాడుతూ, 2.5 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నాను. ఎకరానికి సుమారు రూ.15వేల నుండి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది.వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 6?8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది అని కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతు దస్తగిరి పొలాన్ని సందర్శించారు. ఆరు ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట పరిస్థితులను పరిశీలించారు. ఒకే పంటపై ఆధారపడకుండా, రెండు మూడు రకాల పంటలను సాగు చేస్తే ఒక పంట రాకపోయినా, ఒక పంటకు ఆదాయం వస్తుందని రైతులకు సూచించారు. ×తడకనపల్లె లో పశువుల హాస్టల్‌ను పరిశీలించిన కలెక్టర్‌తదుపరి తడకనపల్లె గ్రామంలోని పశువుల హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ 40 గేదలు ఉన్నాయని, గ్రామంలో రోజుకు 500 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయని, వాటితో రోజుకు సుమా రు 100 కిలోల పాల కోవా తయారు చేస్తున్నారని అధికారులు వివరించారు. జిల్లాలో ఈ పశువుల హాస్టల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రతి రైతు వ్యవసాయం తో పాటు పాడి పశువుల ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మరింత మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్ సహేరబి తదితరులు పాల్గొన్నారు.




# సంపాదకీయం

గురువారం 06-11-2025

## దిగొస్తున్న అగ్రరాజ్యం...

రాబోయే పదేళ్లలో రక్షణ రంగంలో సహకారం పెంపొందించుకోవడానికి వీలైన మౌలిక విధానంపై భారత్, అమెరికా మధ్య ఒక ఒప్పందం కుదిరింది.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య కౌలాలంపూర్‌లో జరిగిన సమావేశం తర్వాత ఈ ఒప్పందాన్ని ప్రకటించారు.'ఈ ఒప్పందం సమన్వయం, సమాచార మార్పిడి, సాంకేతిక సహకారాన్ని పెంపొందిస్తుంది. ప్రాంతీయ స్థిరత్వాన్ని పెంచుతుంది. సంఘర్షణలు పెరగకుండా నివారిస్తుంది' అని పీట్ హెగ్సేత్ ఎక్స్‌లో రాశారు.అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్, భారత్‌పై 50 శాతం సుంకాలు విధించాక, ఉద్రిక్తంగా మారిన సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నవేళ, రెండుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి తుదిరూపు ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్న సమయంలో ఈ ఒప్పందం కుదిరింది.ట్రంప్ టారిఫ్‌లలో రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేసినందుకు జరిమానాగా విధించిన 25 శాతం కూడా కలిసి ఉంది.'ఇప్పటికే బలంగా ఉన్న మన రక్షణ భాగస్వామ్యంలో ఈ ఒప్పందం ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ అనేది మూల స్తంభంగా ఉంటుంది. స్వేచ్ఛాయుత, బహిరంగ, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండే ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని సురక్షితంగా మార్చడానికి ఈ ఒప్పందం చాలా ముఖ్యం' అంటూ భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ ఒప్పందం గురించి సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.రెండు దేశాల మధ్య టారిఫ్ వివాదాల ప్రభావం గురించి యూరేషియా గ్రూప్ థింక్ ట్యాంక్ ప్రమిత్ పాల్ చౌధరీని బీబీసీ ప్రతినిధి షెర్లిన్ మొలాన్ ప్రశ్నించారు.'ఈ ఒప్పందం ఈ ఏడాది జులై-ఆగస్టులో పూర్తి కావాల్సింది. కానీ, పాకిస్తాన్‌తో సంఘర్షణను ముగించానంటూ ట్రంప్ చేసిన ప్రకటనలపై భారత్ అసంతృప్తి చెందడం వల్ల అది ఆలస్యమైంది' అని ప్రమిత్ పాల్ అన్నారు.రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాల శ్రేణిలో ఇది తాజా ఒప్పందమని ప్రమిత్ పాల్ వ్యాఖ్యానించారు.'ఈ ఒప్పందం రెండు దేశాల సైన్యాల మధ్య సమన్వయాన్ని పెంచుతుంది. భారత్‌కు సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. రక్షణ రంగంలో రెండు దేశాల సైన్యాలు కలిసి పనిచేయడం సులభమవుతుంది' అని ఆయన అన్నారు.ఇటీవలి కాలంలో భారత్, అమెరికా తమ రక్షణ సంబంధాలను బలోపేతం చేస్తున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించారు. ట్రంప్‌తో జరిగిన చర్చల్లో రక్షణ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది.భారత్‌కు సైనిక సామగ్రి విక్రయాలను అనేక బిలియన్ డాలర్లకు పెంచుతానని, దీంతో భారత్‌కు ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలు లభించే మార్గం తెరుచుకుంటుందని ట్రంప్ అన్నారు.కానీ అప్పటి నుంచి, రష్యా నుంచి చౌకగా భారత్ చమురును కొనడం, రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల రక్షణ సంబంధాలు ట్రంప్ ప్రభుత్వానికి ఆందోళన కలిగించే అంశాలుగా మారాయి.రెండు దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఎంత ముఖ్యమైనదని సనా హష్మీని ఆయన అడిగారు.'ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ట్రంప్ ట్వీట్లకు, ఆయన సోషల్ మీడియా కార్యకలాపాలకు మనం చాలా ప్రాముఖ్యం ఇస్తున్నామని అనుకుంటున్నా. వీటి ఆధారంగానే మనం భారత్-అమెరికా సంబంధాలను అంచనా వేస్తున్నాం. రెండు దేశాల మధ్య సంబంధాల్లో చీలిక ఏర్పడిందని చెబుతున్నాం. ఎవరైనా ఒక నాయకుడి మూలంగా ఒక రెండు దేశాల సంబంధాలు పెద్దగా ప్రభావితం కావు. ట్రంప్ పదవీకాలం ముగిసిన తర్వాత ఇప్పుడున్న పరిస్థితి మారుతుంది' అని సనా హష్మీ అభిప్రాయపడ్డారు.దక్షిణ కొరియాలో డోనల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశమయ్యారు.చైనాపై విధించిన 'ఫెంటానిల్ టారిఫ్' లను కుదిస్తున్నట్లు ఆ సమావేశం తర్వాత ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ షీ జిన్‌పింగ్ కలుసుకున్నప్పటికీ వారిద్దరి మధ్య సంబంధాలు సానుకూల దిశలో వెళ్తున్నాయని మనం చెప్పలేం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు భారత్ సహాయం చాలా అవసరం. ఇప్పటికీ అమెరికా దృష్టిలో భారత్ ప్రాధాన్యం చెక్కుచెదరకుండా అలాగే ఉంది.భారత్ పట్ల అమెరికా ఇప్పటికీ సానుకూలంగా ఉందని చెప్పడానికి తాజాగా కుదిరిన ఈ ఒప్పందమే నిదర్శనం. సుంకాల వివాదం, రష్యాతో భారత్ సంబంధాల తర్వాత కూడా భారత్‌తో అమెరికా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ట్రంప్ ఏం చెప్పినా రెండు దేశాల మధ్య రక్షణ సంబంధాలు పెరుగుతూనే ఉంటాయి. ఈ ఒప్పందం భారత్ కంటే అమెరికాకే చాలా ముఖ్యమని భావిస్తున్నా' అని సనా హష్మీ అన్నారు.రష్యా ఇప్పటికీ భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారుగా ఉంది. అయితే, భారత్ ఆయుధాల్లో వైవిధ్యాన్ని, దేశీయ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రయత్నిస్తున్నందున భారత రక్షణ కొనుగోళ్లలో రష్యా వాటా క్రమంగా తగ్గుతోంది.అమెరికా నుంచి చమురు, రక్షణ కొనుగోళ్లను పెంచడానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ ఇటీవల సంకేతాలు ఇచ్చింది.ప్రస్తుతం భారత్, అమెరికా అత్యంత కీలకమైన వాణిజ్య ఒప్పందంలో నిమగ్నమై ఉన్నాయి. నవంబర్‌లో ఒక ఒప్పందానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. చాలా కాలంగా దీనికోసం ఎదురుచూస్తున్నాయి.రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు 'శిక్ష'గా అభివర్ణిస్తూ ఈ ఏడాది ఆగస్టులో భారత దిగుమతులపై అమెరికా 50% సుంకం విధించింది.భారత్ ఈ విషయంలో జాగ్రత్తగా స్పందించింది. దేశీయ వినియోగదారుల ప్రయోజనాల కోసమే చమురు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొంది.రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ అతి త్వరలో గణనీయంగా తగ్గిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తనతో చెప్పారని ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనేక సార్లు అన్నారు.భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు. నిరుడు రష్యా నుంచి 52.7 బిలియన్ డాలర్ల విలువైన ముడి చమురును కొనుగోలు చేసింది.

# జర్నలిస్టుల పక్షాన పోరాటమే లక్ష్యం

-ఏపీడబ్ల్యూజేఎఫ్ 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి బి మద్దిలేటి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోరంట్లప్ప
- కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ కరువు
- ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ ని కట్ చేసి సంబరాలు జరుపుకున్న జర్నలిస్టులు
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి నివేదించినట్లు వెల్లడించిన రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ








విభారే. న్యూస్. కర్నూలు ప్రతినిధి. నవంబర్ 4జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయడమే ఏపీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర సభ్యుడు గోరంట్లప్ప పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమాచార శాఖ కార్యాలయావరణలో ఏపీడబ్ల్యూజేఎఫ్ 19వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర అధ్యక్ష కార్యదర్శులు ఎం శివశంకర్, ఎర్రమల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాసి కమిటీ సభ్యుడు గోరంట్లప్ప, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ హాజరై కేకును కట్ చేశారు. నిరంతరం జర్నలిస్టుల సమస్యల కోసం పోరాడుతున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ మరెన్నో దినోత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోరంట్లప్ప మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క సమస్యను కూడా పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో లేని సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ భ్రమలు కల్పించి.. అధికారంలోకి వచ్చాక ఒక సమస్యను పరిష్కరించడం లేదని విమర్శించారు. జర్నలిస్టులకు అక్రిడేషన్లను ఎందుకు మంజూరు చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల విషయంలో కూటమి ప్రభుత్వ నేతలు పూటకో మాట మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎక్కడికక్కడే మీడియా స్వేచ్ఛ ను హరించి జర్నలిస్టులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు రక్షణ చట్టం తేవాలని కోరుకున్న పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు నిత్య కృతమైనట్లు చెప్పారు. మరోవైపు జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో 50% ఫీజు రైతు ఇప్పించాలని అధికారులను కోరారు. సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు. త్వరలోనే అక్రిడేషన్ లతోపాటు ఇళ్ల స్థలాల అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో జర్నలిస్టులు ఎక్కడైనా సమస్యలను ఎదుర్కొంటుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ హుస్సేన్, సాక్షి, ప్రజాశక్తి ఎడిషన్ ఇంచార్జిలు శ్రీనివాసులు నాయుడు, పానుగంటి చంద్రయ్య, సీనియర్ రిపోర్టర్లు చంద్రశేఖర్, చంద్రమోహన్ , వినయ్ కుమార్, రవి ప్రకాష్, రామకృష్ణ, ప్రతాప్, అనిల్, మణిబాబు, నర్సిరెడ్డి, భాస్కరరావు, బాలకృష్ణ, ఓర్వకల్ మధు, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మూకశ్మీర్‌లో ఎదురుకాల్పులు.. ఉగ్రవాదులను చుట్టుముట్టిన భద్రతా దళాలు



జమ్మూకశ్మీర్ కిష్తివాడ్ జిల్లాలో ఆపరేషన్ ఛత్రు కొనసాగుతోంది. ఛత్రూలో ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్టు గుర్తించిన భద్రతా దళాలు ముందస్తు సమాచారంతో కూంబింగ్ నిర్వహించారు. ఉగ్రవాదుల జాడను గుర్తించి.. చుట్టుముట్టారు. దీంతో కిష్తివాడ్ జిల్లా ఛత్రూలో సైనికులు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ మేరకు పోలీసులతో కలిసి ఆపరేషన్ ఛత్రు చేపట్టినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు.కిష్తివాడ్‌లోని ఛత్రు ప్రాంతంలో ఉగ్రవాదులు కొన్ని నెలలుగా దాక్కున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న సైనికులు, కశ్మీర్ పోలీసులతో కలిసి సంయుక్త బృందాలుగా ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఇవాళ(బుధవారం) తెల్లవారుజామున సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## హైదరాబాద్‌లో దారుణం.. చట్నీ పడిందని.. చంపేశారు..

హైదరాబాద్: సభ్యసమాజం ఎటు పోతుందో అర్థం కావడం లేదు. చిన్నచిన్న విషయాలకే సహనం కోల్పోయి ఇతరులపై దాడులకు తెగబడుతున్నారు. కేవలం చట్నీ విషయంలో తలెత్తిన వివాదం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. బట్టలపై చట్నీ పడిందనే చిన్న కారణంతో ఒక వ్యక్తిని నలుగురు యువకులు అతి కిరాతకంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ ఉప్పల్ కల్యాణపురి నివాసి మురళీ కృష్ణ(45) సోమవారం రాత్రి ఎల్బీనగర్ వద్ద ఇంటికి వెళ్లేందుకు కారును లిఫ్ట్ అడిగాడు. ఆ కారులో నలుగురు యువకులు ఉన్నారు. అయితే, మార్గం మధ్యలో వారికి ఆకలి వేయడంతో ఉప్పల్‌లోని ఓ టిఫిన్ సెంటర్ దగ్గర వారంతా టిఫిన్ చేయడానికి ఆగారు. అయితే, అక్కడ అనుకోకుండా మురళీ కృష్ణ ప్లేట్‌లోని చట్నీ ఒక యువకుడిపై పడింది. దీంతో ఆ యువకులు మురళీ కృష్ణతో గొడవకు దిగారు. బలవంతంగా అతడిని కారులోకి ఎక్కించుకుని సుమారు రెండు గంటలపాటు కారులోనే తిప్పుతూ చిత్ర హింసలకు గురి చేశారు.అంతేకాకుండా, నాచారం సమీపంలోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో అతడిని విచక్షణారహితంగా పొడిచారు. నిందితుల నుంచి తప్పించుకునేందుకు మురళీ కృష్ణ ప్రయత్నించి చివరికి తన ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనపై కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

## రేవంత్ రెడ్డి మెదడులో చెత్త ఉన్నది.. బీఆర్ఎస్ మైనారిటీ నేత ఆగ్రహం


హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, రేవంత్‌రెడ్డి మెదడులో చెత్త ఉన్నదని, ఆ చెత్తను పక్కకు తొలగించి మాట్లాడాలని బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ నాయకుడు అబ్దుల్ ముఖీ చాంద్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నందుకే ముస్లింలు ఉన్నారు, ముస్లింలకు ఇజ్జత్ ఉన్నదని జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడాన్ని చాంద్ తీవ్రంగా తప్పుపట్టారు.సీఎం రేవంత్‌రెడ్డి ఆరెస్సెస్ విద్యార్థి అనే విషయం ముస్లింలు అందరికీ తెలుసని, ఆయన ముస్లింలను బెదిరింపులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నాడని అబ్దుల్ ముఖీ ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి కలిసి ముస్లింలను బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు ముస్లింలు భయపడరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ




అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ముస్లింల కోసం చేసింది ఏమీ లేదని మండిపడ్డారు.ముస్లింలకు మంత్రి పదవి ఇస్తామని చెప్పి ఇన్నాళ్లుగా ఆ మాటను నిలబెట్టుకోలేదని, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ముస్లింల ఓట్ల కోసం అజారుద్దీన్‌ను మంత్రిని చేశారని అబ్దుల్ ముఖీ చాంద్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ముస్లింలను అవమానించేలా మాట్లాడారని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని మరో బీఆర్ఎస్ నేత డిమాండ్ చేశారు. సీఎం క్షమాపణలు చెప్పకపోతే కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం నేతలను జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు.జూబ్లిహిల్స్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అరటిపండ్ల వ్యాపారం చేసుకునే ముస్లింల షాపులను, గోదాములను మూసేసిందని ఆయన ఆరోపించారు.

## కార్తీకపౌర్ణమి కోటిదీపోత్సవం ? భక్తుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు

### --భక్తులు అప్రమత్తంగా ఉండాలి అడిషనల్ ఎస్పీ ఎం.జావళి



-- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 05 - కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని మహానంది ఓంకార పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం.జావళి బుధవారం పుణ్యక్షేత్రాన్ని సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఎం.జావళి బండిఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓంకారం మరియు మహానంది ఆలయాలను సందర్శించి సాయంత్రం జరగబోయే జ్వాలాతోరణం, కోటిదీపోత్సవ కార్యక్రమాలకు సంబంధించి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, క్యూ లైన్లు, పంచలింగాల వద్ద నియంత్రణ, వివరాలకేంద్రం, కోనేరు పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలను పరిశీలించారు.భక్తుల రక్షణ, భద్రత కొరకు పోలీసులు జారీ చేసిన సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. కోనేరులో పుణ్యస్నానాల సమయంలో చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని హెచ్చరించారు. పోలీసుల సూచనలు ప్రజల రక్షణ కోసమేనని భక్తులు గుర్తుంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాలూకా రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, బండిఆత్మకూరు ఎస్ఐ జగన్మోహన్, మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి

### జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు

--కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మనాయుడు పేట గ్రామంలో బుధవారం స్వదేశీ ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ? “దేశ అభివృద్ధికి మూలం స్వదేశీ ఉత్పత్తులే. ప్రతి భారతీయుడు 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను వినియోగించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి. యువత దేశభక్తితో, స్వదేశీ భావనతో ముందుకు రావాలి” అని పిలుపునిచ్చారు.మండల అధ్యక్షుడు రామసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక వ్యాపారులు స్వదేశీ వస్తువుల ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు.అభిరుచి మధు మాట్లాడుతూ, “ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి 'వోకల్ ఫర్ లోకల్' పిలుపు ప్రతి కుటుంబం ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన ఆత్మనిర్భర్ భారత్ సాధ్యమవుతుంది'' అని తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్బారెడ్డి, సతీష్, లక్ష్మీనారాయణ, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



# నారా లోకేష్ లో ఎంత మార్పు




విజయవాడ, నవంబర్ 5, రాజకీయాల్లో ప్రతి అనుభవం అక్కరకు వస్తుంది. రాజకీయ పరిస్థితులు కూడా నేతలలో ఒక రకమైన మార్పునకు కారణం అవుతాయి. ఈ విషయంలో ఏపీ మంత్రి నారా లోకేష్ గురించి మనం ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. ఎలాంటి లోకేష్.. ఎలా మారారు అన్నది ప్రత్యర్థులకు తెలుసు. సొంత పార్టీ వారికి తెలుసు. ఏపీ ప్రజలకు తెలుసు. లోకేష్ ప్రతి మార్పును గమనిస్తున్నారు ఈ రాష్ట్ర ప్రజలు. వ్యతిరేకించిన వారే గౌరవిస్తున్నారు. వ్యతిరేకంగా ప్రచారం చేసిన వారి ఫిదా అవుతున్నారు. ఒక నాయకుడికి ఇంతకంటే ఏం కావాలి. గోల్డెన్ స్పూన్ తో పుట్టే నాయకుడి కంటే.. గ్రౌండ్ లెవెల్ నుంచి కష్టాలు ఎదురొడ్డి నిలిచేవాడే నిజమైన నాయకుడిగా అవతరిస్తాడు. అటువంటి ఛాన్స్ వచ్చింది నారా లోకేష్ కు. తాత ఎన్టీఆర్ మాజీ ముఖ్యమంత్రి. తండ్రి చంద్రబాబు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పదవి అలంకరించిన వారు. మామ బాలకృష్ణ తెలుగు సినిమా ఇండస్ట్రీలో టాప్ మోస్ట్ యాక్టర్. అటువంటి నారా లోకేష్ ఎంట్రీ ఎలా ఉండాలి. తండ్రి చంద్రబాబు గ్రాండ్ ఎంట్రీ ఇవ్వగలిగారు. కానీ అంతే మించి రాజకీయ ప్రత్యర్థులను ఇచ్చారు. కానీ వాటన్నింటినీ దాటుకొని తనను తాను ప్రూవ్ చేసుకున్నారు నారా లోకేష్.2024 ఎన్నికల వరకు లోకేష్ పై ఎవరికీ నమ్మకం లేదు. చివరకు సొంత పార్టీ శ్రేణులకు సైతం ఏదో ఒక మూల అపనమ్మకం. రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాదయాత్ర చేసి ప్రజలతో మమేకమై వచ్చారు. సొంత పార్టీతో పాటు ప్రజలలో చిన్నపాటి ముద్రతో బయలుదేరారు లోకేష్. కానీ కేంద్ర పెద్దలతో మమేకం అయిన తీరు, తన తండ్రి అక్రమ అరెస్టు సమయంలో తపన పడిన తీరు, కూటమి కట్టడంలో వ్యవహరించిన తీరు, అధికారంలోకి వచ్చిన తరువాత పాలనతో పాటు పార్టీ పై ముద్ర చాటిన తీరు? ఇలా ప్రతి అంశంలోనూ పై చేయి సాధిస్తూ వచ్చారు. ఇప్పుడు నారా లోకేష్ అంటే ఒక శక్తి, ఒక వ్యవస్థ అన్నట్టు మార్చుకున్నారు.లోకేష్ తీసుకున్న నిర్ణయం అద్భుతంగా ఉంటుంది. తనను తాను భావి నాయకుడిగా ఆవిష్కరించుకునే తీరు కూడా ఆకట్టుకుంటుంది. నిర్ణయాల్లో తప్పుడు వ్యవహారాలు ఉండవు. ఒకరి ప్రభావం కూడా ఉండదు. ఇటీవల జరిగిన రెండు ఘటనలే దానికి ఉదాహరణ. కాశీబుగ్గ లో ఓ ఆలయంలో తొక్కిసలాట జరిగింది. పదిమంది చనిపోయారు. అక్కడ గుడి కట్టింది ఓ సామాన్య భక్తుడు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రతి ఒక్కరికి తిరుమల మాదిరిగా దర్శనం కల్పించాలన్న లక్ష్యంతో నిర్మించారు. కానీ ఈ ఘటన జరిగిన తర్వాత సదరు ఆలయ వ్యవస్థాపకుడు పై కేసు పెట్టాలని ఒత్తిడి పెరిగింది. అరెస్టు చేయాలన్న డిమాండ్ వచ్చింది. కానీ అందుకు అంగీకరించలేదు లోకేష్. అది సహేతుకం కాదని తేల్చేశారు. ఇటువంటి ప్రైవేటు దేవాలయాల విషయంలో ఒక వ్యవస్థను తేవాలని మాత్రమే చూశారు. సొంత పార్టీతోపాటు ప్రత్యర్థి పార్టీల ఒత్తిడికి ఎంత మాత్రం తలవంచలేదు లోకేష్.ఏపీకి చెందిన భక్తులు తమిళనాడులోని ఆలయాల సందర్శనకు వెళ్లారు. ప్రత్యేక బస్సులు వెళ్లారు. అక్కడి అల్లరి మూకాలతో పాటు ఆటో డ్రైవర్లు అడ్డగించారు. అల్లరి చేసే ప్రయత్నం చేశారు. ఆ సమస్య మంత్రి నారా లోకేష్ దృష్టికి వచ్చింది. ఇదో ప్రాంతీయ సమస్యగా మారుతుందని భావించారు లోకేష్. నేరుగా తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ తో సంప్రదించారు. జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రాల మధ్య సమస్యగా మార్చవద్దని విజ్ఞప్తి చేశారు. ఉదయనిది స్టాలిన్ దీనికి సానుకూలంగా స్పందించారు. బస్సులో వెళ్ళిన ఏపీ భక్తులతో పాటు పర్యాటకులకు భద్రత కల్పించారు. ఈ రెండు ఘటనలు లోకేష్ భావి నాయకుడిగా ఊహించడానికి ఎంత మాత్రం తక్కువ కాదు అని తేలిపోయింది. ప్రజలకు పాలన అందించడం అంటే కేవలం హోదా అనుభవించడం కాదు. వారి కష్టసుఖాల్లో.. సుఖ దుఃఖాల్లో ఉండడం అని నిరూపించారు నారా లోకేష్. నిజంగా ఇది అభినందనీయమే. ఏపీకి ఒక భావి నాయకుడు లోకేష్ రూపంలో దొరికినట్టే.

# పాపం... శ్యామలేనా.. మిగిలింది



విజయవాడ, నవంబర్ 5, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పని చేసిన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు పార్టీకి దూరమయ్యారు. 2024 ఎన్నికల్లో ఓటమి ఎదురైన తరువాత సినీ నటుడు అలీ తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని తేల్చేశారు. ఎన్నికలకు ముందే వైసిపి తో తనకు సంబంధం లేదన్నట్టు స్వచ్ఛందంగా తప్పుకున్నారు మంచు మోహన్ బాబు. అయితే నటుడు, రచయిత పోసాని కృష్ణ మురళి మాత్రం కాస్త యాక్టివ్గానే ఉండేవారు. వైసీపీలో క్రియాశీలకంగా పని చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ వైసీపీ హయాంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కు సంబంధించి కేసు మెడకు చుట్టుకుంది. చాలా రోజులు పాటు పోసాని జైలులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ ప్రభావం ఆయన ఆరోగ్యం పై కూడా చూపింది. దీంతో వైసీపీలో క్రియాశీలకంగా ఉండడాన్ని తగ్గించేశారు పోసాని. అయితే ఇప్పుడు సినీ పరిశ్రమ నుంచి ఉన్నది కేవలం మాజీ మంత్రి రోజా మాత్రమే. అయితే తాజాగా ఆమెకు సినీ యాంకర్ శ్యామల తోడైంది. ప్రస్తుతం ఆమె సైతం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది.మొన్న ఆ మధ్యన కర్నూలు బస్సు ఘటన జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫేక్ ప్రచారానికి దిగింది. హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. ఓ ద్విచక్ర వాహనదారుడు ఇందుకు కారణం అని తేలింది. అయితే సదరు యువకుడు బెల్ట్ షాపులో నకిలీ మద్యం తాగడం వల్లే ఆ ఘటనకు కారణమయ్యాడని యాంకర్ శ్యామల ఆరోపించారు. అయితే సదరు యువకుడు మద్యం దుకాణంలో మద్యాన్ని కొనుగోలు చేసిన సీసీ ఫుటేజీ బయటకు వచ్చింది. కేవలం ప్రభుత్వం పై విమర్శలు చేసేందుకే శ్యామల ఆతరహా ఆరోపణలు చేసినట్టు తేలింది. దీంతో కర్నూలు పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్ననే పోలీస్ స్టేషన్కు వెళ్లారు శ్యామల. వెంట కర్నూలు వైసీపీ నేతలు ఉన్నారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఆ పార్టీకి క్రమేపి దూరమయ్యారు. కమెడియన్ అలీ లాంటి వ్యక్తులు సినీ పరిశ్రమలో ఇబ్బంది పడినట్టు వార్తలు వచ్చాయి. కానీ ఆయన కంటూ ప్రత్యేక గుర్తింపు సినీ పరిశ్రమలో ఉండడంతో నిలదొక్కుకున్నారు. మోహన్ బాబు సైతం ఏ పార్టీతో కలవకుండా తన పని తాను చేసుకుంటున్నారు. పోసాని కృష్ణ మురళి సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధపడ్డారు. కానీ యాంకర్ శ్యామల మాత్రం తిరిగి బుల్లితెరపై కనిపించడమే మానేశారు. అయితే ఆమె రాజకీయాలు చేసిన తర్వాత వృత్తిపరంగా పెద్దగా అవకాశాలు లేకుండా పోయాయి. అందుకే నెలకు 3 లక్షల రూపాయల వేతనంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా మారిపోయారు అన్న వార్తలు వచ్చాయి. కానీ బుల్లితెరపై యాంకరింగ్ అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె వైయస్సార్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో దూసుకుపోతోంది. అమరావతి రాజధాని నిర్మాణం చేపడుతోంది. పోలవరం ప్రాజెక్టు పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. మరోవైపు విశాఖకు భారీ ఐటి సంస్థలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం పరిశ్రమలను ఏర్పాటు చేస్తోంది. అయితే ఏ చిన్న లోపం వెలుగు చూసినా దానిని హైలెట్ చేస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ప్రజా పోరాటాలకు దూరంగా.. ప్రభుత్వంపై వ్యతిరేక ప్రచారానికి దగ్గరగా ఉంటుంది ఆ పార్టీ. అయితే ఇప్పుడు అంతా సోషల్ మీడియా యుగం. ప్రజలకు ఇట్టే నిజాలు తెలిసిపోతున్నాయి. ఇటువంటి సమయంలో స్ట్రాటజీలు మార్చాలి. కానీ వైసీపీ పాత చింతకాయ వాసన మాదిరిగా.. అదే ధోరణితో ముందుకు సాగుతోంది. అయితే ఇప్పుడు అరెస్టులు అంటూ గగ్గోలు పెడుతోంది. ఒకసారి అరెస్టుల తీరు చూస్తుంటే ఇట్టే అర్థం అవుతుంది. ధర్మాన ప్రసాదరావు జోలికి వెళ్లారా? బొత్స సత్యనారాయణ పై కేసులు నమోదు చేశారా? ఒకసారి కేసుల నమోదు.. అరెస్టులు జరుగుతున్న నేతల ట్రాక్ రికార్డును చూస్తే ఇట్టే అర్థమయిపోతుంది.తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ అయ్యారు. కల్తీ మద్యం కేసులో ఆయనను అరెస్టు చేశారు. వాస్తవానికి జోగి రమేష్ పై నమోదు చేసేందుకు చాలా కేసులు ఉన్నాయి. అరెస్టు చేసేందుకు అవసరమైన ఆధారాలు కూడా ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రం తో పాటు నవ్యాంధ్రప్రదేశ్లో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు చంద్రబాబు. సీనియర్ మోస్ట్ లీడర్ కూడా.ఇంటిపై దాడికి ప్రయత్నించారు జోగి రమేష్. అప్పట్లో అది సంచలనమే. టిడిపి శ్రేణులు రక్తం మరిగింది. అధికార మదంతో నాడు జోగి రమేష్ ఆ ప్రయత్నం చేశారు. దానికి ఏం చేయాలి? అధికారంలోకి వచ్చిన వెంటనే జోగి రమేష్ ను అరెస్టు చేయాలి. ఆ ఛాన్స్ వచ్చింది కూడా.. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. అయితే ప్రభుత్వం ఇదే ఉదాసీనతతో ఉంటుందని భావించిన జోగి రమేష్.. కల్తీ మద్యంతో చెడ్డ పేరు తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అలా ప్రయత్నం చేసే క్రమంలో ప్రధాన నిందితుడే తమను జోగి రమేష్ ప్రోత్సహించాడని బయట పెట్టేశారు. అంటే ఇప్పుడు అరెస్టు జరిగింది కొత్త కేసులో మాత్రమే. పాత కేసులను తిరగ దోడలేదు. కేవలం కొత్త కేసులో మాత్రమే జోగి రమేష్ ను అరెస్టు చేశారు.గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విషయంలో కూడా అలానే జరిగింది. ఆయన దూకుడు తనం తెలియంది కాదు. పద్ధతి లేకుండా మాట్లాడేవారు. చంద్రబాబు వయసును లెక్క చేయకుండా నూటికి ఎంత వస్తే అంత మాట అనేవారు. సాక్షాత్ అసెంబ్లీలోనే చంద్రబాబు సతీమణి గురించి నీచంగా మాట్లాడారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే వల్లభనేని వంశీ మోహన్ జోలికి పోలేదు ప్రభుత్వం. కానీ తన పాత తప్పులు ఎక్కడ బయట పడతాయో.. అని కొత్త తప్పులు చేశారు వల్లభనేని వంశీ మోహన్. ఏకంగా టిడిపి కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తిని బెదిరించారు. ఏరి కోరి కష్టాలను తెచ్చుకున్నారు. అలా ప్రభుత్వాన్ని కెలికి ఇబ్బందులు తెచ్చుకున్నారు. అంటే ప్రభుత్వం వారి జోలికి వెళ్లలేదు. ప్రభుత్వం జోలికి వారు వచ్చారన్నమాట.వైసీపీ హయాంలో సీనియర్ మంత్రులుగా ఉన్న చాలామంది ఇప్పుడు సేఫ్ జోన్ లో ఉన్నారు. ఎందుకంటే వారు రాజకీయాల్లో తమ కోసం తాము పని చేశారు. కానీ దూకుడు కలిగిన నేతల మనస్తత్వాన్ని గ్రహించారు జగన్. తన రాజకీయం కోసం వారిని పావులుగా వాడుకున్నారు. అయితే ఇప్పుడు వారే మూల్యం చెల్లించుకుంటున్నారు.

# జూన్ నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు రెడీ

విజయనగరం, నవంబర్ 5, ఆంధ్రప్రదేశ్లో కొత్త విమానాశ్రయాల దిశగా అడుగులు పడుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు వేగవంతం అయ్యాయి. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు భోగాపురం ఎయిర్పోర్ట్ పనులను పరిశీలించి, ఉత్తరాంధ్రకు ఇది కీలక కేంద్రంగా మారుతుందని తెలిపారు. 2026 జూన్ నాటికి విమానాశ్రయాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంత అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు.ఆంధ్రప్రదేశ్లో కొత్త ఎయిర్పోర్టుల దిశగా అడుగులుపడుతున్నాయి.. అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు వేగవంతం చేశారు. ఈ మేరకు ఎయిర్పోర్ట్ పనుల్ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు పరిశీలించారు, పనుల పురోగతిపై ఆరా తీశారు. భోగాపురం గ్రీన్ఫీల్డ్ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు ఒక ముఖ్యమైన కేంద్రంగా మారుతుందన్నారు రామ్మోహన్ నాయుడు. ఈ విమానాశ్రయం పూర్తయితే, ఈ ప్రాంతంలో జరిగే ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా ఇది ఒక ప్రధాన కేంద్రంగా ఉంటుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విమానాశ్రయ నిర్మాణాన్ని ఒక పెద్ద సవాలుగా స్వీకరించారన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా, అనుకున్న సమయానికి విమానాశ్రయాన్ని పూర్తి చేయడానికి అధికారులు నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు. 2026 జూన్ నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచిస్తున్నారన్నారు. ఈ ఏడాది డిసెంబరు చివరి వారంలో లేదా వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో విమానాశ్రయంలో విమానం ట్రయల్ రన్ నిర్వహించే అవకాశం ఉందన్నారు రామ్మోహన్నాయుడు. విమానాశ్రయం చుట్టూ ఐదు స్టార్ హోటళ్లు కూడా వస్తున్నాయని, దీనివల్ల స్థానికులకు వారి ప్రతిభకు తగిన ఉద్యోగాలు లభిస్తాయన్నారు. తద్వారా, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు నాణ్యతతో జరుగుతున్నాయని, విశాఖపట్నం కంటే ఇక్కడ ఎక్కువ విమానాలు నడిచేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కొన్ని ఎయిర్లైన్స్తో మాట్లాడామన్నారు. నావిగేషన్, ట్రాఫిక్ కంట్రోల్ సదుపాయాలు కల్పిస్తామని, గ్లోబల్ స్టాండర్డ్స్తో విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నామన్నారు. భోగాపురం విమానాశ్రయంలో టాక్సీవే, రన్వేల నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మాణం 91.7 శాతం పూర్తి అయిందన్నారు. భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది అన్నారు.భోగాపురం విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్నామని, ఈ నెలలో విశాఖలో నిర్వహించబోయే పారిశ్రామిక సదస్సులో ఏవియేషన్ రంగానికి సంబంధించిన పరిశ్రమలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గతంలో కేంద్రమంత్రి అశోక్గజపతిరాజు పునాది వేసిన ఈ విమానాశ్రయం చివరి దశకు రావడం చాలా సంతోషంగా ఉందని.. భోగాపురం విమానాశ్రయం ఈ ప్రాంత రూపురేఖలను మార్చివేసి, అభివృద్ధిని వేగవంతం చేస్తుందని అన్నారు. ఆ తర్వాత, విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన జీఎంఆర్, ఎల్అండ్టీ అధికారులతో ఒక సమీక్ష

# చంద్రబాబు సమిట్ కోసం పరుగులు

విజయవాడ, నవంబర్ 5, ఏపీ సీఎం చంద్రబాబు కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారు. ఏడుపదుల వయసులో కూడా.. ఆయన కష్టపడుతున్న తీరు అభినందనీయమే. ప్రస్తుతం ఆయన లండన్ పర్యటనలో ఉన్నారు. ఆయన సతీమణి భువనేశ్వరికి అత్యుత్తమ అవార్డులు వచ్చాయి. ఆ అవార్డుల స్వీకరణకు గాను ఆయన సతీమణితో కలిసి లండన్ వెళ్లారు. అదే సమయాన్ని చంద్రబాబు సద్వినియోగం చేసుకుంటున్నారు. వచ్చే నెలలో విశాఖ వేదికగా జరగనున్న పెట్టుబడుల సదస్సుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను స్వాగతిస్తున్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థలను ఆహ్వానిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే చంద్రబాబు గత కొద్దిరోజులుగా చేస్తున్న పెట్టుబడుల ప్రయత్నాలపై ఏపీవ్యాప్తంగా సంతృప్తి కనిపిస్తోంది. ప్రస్తుతం లండన్ పర్యటన కూడా ప్రతిష్టాత్మకంగా మారింది.ఏపీలో కూటమ అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతోంది. నాలుగో సారి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. అది మొదలు ఆయన ఈ రాష్ట్రానికి ఏదో చేయాలన్న తలంపుతోనే ఉన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు పలుమార్లు విదేశీ పర్యటనలకు వెళ్లారు. దావోస్ లో పెట్టుబడుల సదస్సు మొదలు మొన్నటి సింగపూర్ పర్యటన వరకు ప్రతిదీ రాష్ట్రం కోసమే. అయితే లండన్ పర్యటనలో భాగంగా విశాఖపట్నం ఆహ్వానించాలని భావించారు. ఇంతలోనే ఆయన సతీమణి భువనేశ్వరికి ప్రతిష్టాత్మకంగా రెండు అవార్డులు లభించాయి. ఒకవైపు వ్యక్తిగత పర్యటన సాగిస్తూనే రాష్ట్రానికి పెట్టుబడుల అన్వేషణ కోసం చంద్రబాబు ప్రస్తుతం లండన్ లో బిజీగా ఉన్నారు.విశాఖలో ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు పెట్టుబడుల సదస్సు జరగనుంది. దాదాపు పదిలక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొన్ని రకాల ఒప్పందాలు జరిగాయి. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. అమెరికా వెలుపల, ఆసియా ఖండంలో అతిపెద్ద డేటా సెంటర్ ఇది. దానితోపాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం వచ్చాయి. అయితే పది లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రచారం జరుగుతోంది. అయితే ఉద్యోగాల విషయంలో ఉత్తరాది రాష్ట్రాల వారు కూడా ఉంటారు. కానీ అన్నింటికీ మించి ఈ రాష్ట్రానికి పన్నుల రూపంలో ఆదాయం సమకూర్తుంది. ఆపై మౌలిక వసతుల కల్పనలో భాగంగా రియల్ ఎస్టేట్ కు ఎనలేని ప్రాధాన్యము లభిస్తుంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఏ సమావేశం జరిగిన ఏపీ గురించి చర్చ జరుగుతోంది. తద్వారా ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తే రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకునే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి అదే అవసరం కూడా. చంద్రబాబు ఆశపడుతోంది అదే.

# 7 కోట్లు.. 55 మీటర్లు..


## 100మందిని ఒకేసారి ఆపగలిగే దృఢత్వం


విశాఖపట్టణం, నవంబర్ 5, భవిష్యత్తులో ఏ ఇజమూ ఉండదు.. కేవలం టూరిజం మాత్రమే ఉంటుంది " అని ఏపీ సీయం చంద్రబాబు పదే పదే చెబుతుంటారు. దాని తగ్గట్టే ఆంధ్రప్రదేశ్లో టూరిజం ప్రాజెక్టులు చాలానే పట్టాలు ఎక్కాయి. కొన్ని ప్రభుత్వమే చేపడుతుంటే మరికొన్ని పీపీపీ మోడల్ లో తయారవుతున్నాయి. అయితే మాటల్లో చెప్పినంత వేగంగా ఇవి రియాల్టీ లోకి రావడం లేదు. చాలా విషయాల్లో కమ్యూనికేషన్ గ్యాప్ బలంగానే ఉంది. అలాంటి వాటికి ఉదాహరణ వైజాగ్ లోని కైలాసగిరి గ్లాస్ బ్రిడ్జ ఓపెనింగ్. నెలల క్రితమే తయారైన ఈ బ్రిడ్జ ఇప్పటికీ ఓపెన్ కాకపోవడం వైజాగ్ వాసుల్లో అసహనాన్ని రేకెత్తిస్తోందిభారతదేశంలోనే ఇంకెక్కడా లేని అతి పెద్ద కేంటి లివర్ గ్లాస్ బ్రిడ్జ విశాఖలో రెడీ అయిందనే వార్త ఒక్క వైజాగ్ వాసులకే కాక రెండు తెలుగు రాష్ట్రాల్లోని టూరిస్టులకు చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. కైలాసగిరి కొండ అంచు పై నుండి గ్లాస్ బ్రిడ్జపై నడుస్తూ పర్వతం,లోయ, అడవి,సముద్రం ఇలా విభిన్నమైన ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించే అవకాశం ఈ గ్లాస్ బ్రిడ్జ ఇస్తుందని అందరూ ఉప్పొంగి పోయారు. మొదట్లో ఆగస్టు 15 టైమ్ కి రెడీ అవుతుందని భావించినా పనులు ఆలస్యం వల్ల సెప్టెంబర్ లో ప్రారంభిస్తామన్నారు.వైజాగ్ గ్లాస్ బ్రిడ్జ ఓపెనింగ్ ఇంకెప్పుడు ? నిర్మాణం పూర్తయినా ఎదురుచూపులు ఎందుకు? సెప్టెంబర్ 25 కి బ్రిడ్జి ఓపెన్ అవుతుందని వార్తలు కూడా వచ్చాయి. తర్వాత అక్టోబర్ వచ్చింది, దసరా, దీపావళి కూడా వెళ్లిపోయాయి. నవంబర్ నెల కూడా వచ్చేసింది. అయినప్పటికీ ఈ స్కైవాక్ గ్లాస్ బ్రిడ్జ ఓపెనింగ్ ఎప్పుడు అనేది తెలియక వైజాగ్ వాసులు అయోమయంలో పడ్డారు. టూరిజం పరంగా ఎంతో పొటెన్షియల్ ఉన్న వైజాగ్ లో ఈ గ్లాస్ బ్రిడ్జ పెద్ద అట్రాక్షన్ అవుతుందని అందరూ భావిస్తున్నారు. ఏడు కోట్లు ఖర్చుపెట్టి 55 మీటర్ల పొడవున ఈ గ్లాస్ బ్రిడ్జ ని నిర్మించారు. కేరళ లో ఇలాంటి బ్రిడ్జ ఇంకొకటి ఉంది కానీ దాని పొడవు 38 మీటర్లే. ఇదే ఏడాది మిజోరామ్ లో కూడా ఐజ్వాల్ స్కై వాక్ పేరుతో ఒక గ్లాస్ బ్రిడ్జ ఓపెన్ చేశారు కానీ దాని పొడవు 10 మీటర్లే. ఎలా చూసినా విశాఖపట్నం లోని స్కై వాక్ బ్రిడ్జ దేశం లోనే చాలా పెద్దది. 250ఎ వేగం తో వీచే గాలులను సైతం తట్టుకునేలా దీన్ని నిర్మించినట్టు చెబుతున్నారు. ఎఓఖీఆం ఈ నిర్మాణన్ని సూపర్ వైజ్ చేస్తుండగా కేరళకు చెందిన ఖీఏ అడ్వెంచర్స్ సంస్థ నిర్మాణం చేసింది. ఇది ఒకేసారి 100 మంది బరువును తట్టుకుంటుంది అని నిర్వాహకులు చెబుతున్నారు.ఎఓఖీఆం చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఈ స్కై వాక్ బ్రిడ్జ పై ప్రత్యేక దృష్టి పెట్టారు.. చాలాసార్లు వెళ్లి నిర్మాణాన్ని పర్యవేక్షించి వచ్చారు. ఆయన ఈ స్కైవాక్ బ్రిడ్జిని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఓపెన్ చేయించాలని ప్రయత్నిస్తున్నారని సమాచారం. బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత లోకేష్ రెండుసార్లు వైజాగ్ వెళ్లి వచ్చారు. అయినప్పటికీ స్కై వాక్ బ్రిడ్జ ఓపెన్ కాలేదు. లోకేష్ టైం దొరక్కే గ్లాస్ బ్రిడ్జ ఓపెనింగ్ లేట్ అవుతుందని వీఎంఆర్డిఏ వర్గాలు చెబుతున్నాయి వైజాగ్ గ్లాస్ బ్రిడ్జ ఓపెనింగ్ ఇంకెప్పుడు ? నిర్మాణం పూర్తయినా ఎదురుచూపులు ఎందుకు? ఈ నెలలో ( నవంబర్ 14-15 తేదీల్లో ) వైజాగ్ లో రెండు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు జరగబోతుంది. పెట్టుబడులను ఆకర్షించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా దీన్ని నిర్వహిస్తోంది. దేశ విదేశాల్లోని పారిశ్రామిక వ్యాపార అతిథులను ఆహ్వానించడం కోసం సీఎం చంద్రబాబు లోకేష్ విదేశీ పర్యటనలు సైతం చేసి వచ్చారు. వైజాగ్ లోని టూరిజం

## ఐఎంఏ మహిళా విభాగం నూతన కార్యవర్గం

**అధ్యక్షురాలిగా డాక్టర్ మాధవి-కార్యదర్శులుగా డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ**







--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 05 - నంద్యాల ఐఎంఏ మహిళా విభాగ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు సంవత్సరాల పదవీకాలానికి 38 మంది సభ్యులతో కొత్త బృందం ఏర్పడింది.మధు చిన్నపిల్లల ఆసుపత్రి నిర్వాహకురాలు, అనస్తీషియా నిపుణులు డాక్టర్ మాధవి అధ్యక్షురాలిగా, డాక్టర్ పెసల సునీత, డాక్టర్ శైలజ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా డాక్టర్ హరిత, ఉపాధ్యక్షులుగా డాక్టర్ నాగరేఖ, డాక్టర్ ధనలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ శశికిరణ్, డాక్టర్ శిల్ప, డాక్టర్ సింధుశ్రీ, డాక్టర్ గీతావాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా డాక్టర్ రాధిక, డాక్టర్ రజని, డాక్టర్ తనూజ, డాక్టర్ దివ్యతేజ, సహ కోశాధికారులుగా డాక్టర్ లలిత, డాక్టర్ మల్లీశ్వరి ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా అనేక మంది మహిళా వైద్యులు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర స్థాయి ఐఎంఏ నాయకులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ విజయభాస్కర రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు తదితరులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు డాక్టర్ మాధవి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, బాలికలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు.


## శ్రీశైలం రాయలసీమ ఆత్మజ్యోతి జనసేన నాయకుడు మురళి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 05 :?జ్యోతిర్లింగమైన శ్రీశైలం రాయలసీమ ప్రజల ఆత్మజ్యోతి అని జనసేన పార్టీ మండల నాయకుడు మురళి పేర్కొన్నారు. శ్రీశైలం క్షేత్రం నంద్యాల జిల్లాలో కొనసాగుతుందని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం జనసేన చేస్తుందన్నారు.కార్తిక పౌర్ణమి సందర్భంగా మహానంది మండలంలోని తెలుగు గంగ వినాయక ఘాట్ వద్ద జనసేన ఆధ్వర్యంలో జలహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నవనందుల పాదయాత్ర భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కాలినడకన వెళ్లే భక్తులకు వడపప్పు, గుళ్ళు, అరటిపళ్ళు, తాగునీరు, వాహన సేవల సౌకర్యం కల్పించారు.కార్యక్రమం లో జనసేన నాయకులు మురళి ప్రసాద్, కాకర్ల శివరామచంద్రుడు, కాకర్ల రామకృష్ణ, చందు రామసుబ్బయ్య, సుబ్బరాయుడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ నందిలో కమిషనర్ శేషన్న ప్రత్యేక పూజలు

**కార్తీక పౌర్ణమి సందర్భంగా వేదపండితుల ఆశీర్వచనాలు**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 05 - కార్తీక మాస పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పవిత్రక్షేత్రం ప్రథమ నందిలో మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు.వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ? ప్రథమ నంది ఆలయం ధార్మిక వైభవానికి ప్రతీక, ఇక్కడ పూజలు చేయడం పుణ్యప్రదమైందని పేర్కొన్నారు.కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజనీర్ గురప్పయాదవ్, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ లక్ష్మినారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యువతలోని ప్రతిభను ప్రదర్శించడానికి చక్కని అవకాశం

**ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి:కలెక్టర్ రాజకుమారి గణియా**

**దేశ అభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర ? ఎంపీ బైరెడ్డి శబరి**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 05 - యువతలోని సృజనాత్మకత, ప్రతిభ, నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి యువజనోత్సవాలు వేదికగా నిలుస్తున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. నంద్యాల రామకృష్ణ డిగ్రీ & పిజి కళాశాల ఆడిటోరియంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా యువజనోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, సెట్కూరు సీఈఓ డా. కె. వేణుగోపాల్, కళాశాల చైర్మన్ జి. రామకృష్ణారెడ్డి, మెప్మా పీడీ వెంకటదాస్, డైరెక్టర్ ప్రగతి, టిడిపి నాయకుడు ఎన్.ఎం.డి. ఫిరోజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ?"స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువత తమ ప్రతిభను సామాజికాభివృద్ధి దిశగా మలచుకోవాలి. వ్యాసరచన, వాక్చాతుర్యం, పెయింటింగ్, నృత్యం, గానం, జానపద కళలలో చురుకుగా పాల్గొనాలి. విద్యార్థులు గెలుపు?ఓటములను సమానంగా స్వీకరిస్తూ జీవిత విజయానికి పునాది వేయాలి" అన్నారు.జిల్లా వ్యవసాయ ఆధారిత కుటుంబాల యువత తమ నైపుణ్యాలను సమాజానికి ఉపయోగపడే విధంగా మార్చుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం నుండి కనీసం ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలని ముఖ్యమంత్రి సంకల్పమని పేర్కొన్నారు.ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ?"దేశాభివృద్ధిలో యువతదే ప్రధాన భూమిక. సాంప్రదాయ విలువలను కాపాడుకుంటూ ఆధునికతను అంగీకరించాలి. మహిళా క్రికెట్ జట్టు వరల్డ్ కప్ గెలిచి దేశ గౌరవాన్ని నిలబెట్టింది; వారిని ఆదర్శంగా తీసుకొని యువత కూడా తమ రంగాల్లో ప్రతిభ చాటుకోవాలి" అని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

# నంద్యాల మండలంలో 601 హెక్టార్లలో పంట నష్టం

## మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 05 - నంద్యాల మండలంలో తుఫాను బీభత్సంలో 601 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, మినుము, సోయాబీన్ పంటలు దెబ్బతిన్నాయి మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు పేర్కొన్నారు. ఇటీవల సంభవించిన తుఫాను ప్రభావంతో నంద్యాల మండల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. మండలవ్యాప్తంగా మొత్తం 8,500 హెక్టార్లలో సాగు పంటల లో 601 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు.బుధవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ?''నంద్యాల మండలంలో 555 హెక్టార్లలో వరి, 32.3 హెక్టార్లలో మొక్కజొన్న, 7.4 హెక్టార్లలో మినుము, 3.4 హెక్టార్లలో సోయాబీన్ పంటలకు తీవ్ర నష్టం సంభవించింది'' అని వివరించారు.ప్రతి గ్రామ సచివాలయంలో పంట నష్టం వివరాలతో కూడిన జాబితాను ప్రదర్శించామని, రైతులు వివరాలు పరిశీలించవచ్చని ప్రసాదరావు తెలిపారు. అలాగే, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తగిన పరిహారం చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కర్నూలు నుండి రాజధాని అమరావతికి ప్రత్యేక రైళ్లు నడపండి

## ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న



విభారే న్యూస్. కర్నూలు ప్రతినిధి. నవంబర్ 4 కర్నూలు నగరం నుండి మన రాజధాని అమరావతికి ప్రత్యేక రైళ్లు నడపాలని జిల్లా ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు బి బతుకన్న మరియు ఐఎన్టియుసి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ లు కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాడు నాగరాజు గారికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాడు నాగరాజు గారిని కలిసి కర్నూలు పట్టణానికి రాజధాని చాలా దూరంలో ఉందని బస్సుల్లో ప్రయాణం అంటే ఘాట్ రోడ్డు నందు వెళ్ళవలసి వస్తుందని బస్సు ప్రయాణం ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియడం లేదని వర్షాకాలంలో శ్రీశైలం ఘాట్ లో రోడ్డు నందు ప్రయాణించాలంటే అక్కడక్కడ రోడ్లు సరిగా లేనందువల్ల జామ్ అయిపోవడం వలన కొన్ని గంటల వరకు వాహనాలు నిలిచిపోతున్నాయని కాబట్టి బస్సు ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉందని మన కర్నూలు పట్టణం కర్ణాటక బార్డర్ లో ఉంది కాబట్టి మీరు పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మన కర్నూలు పట్టణము నుండి ప్రతిరోజు రాజధాని విజయవాడకు ఉదయం ఇంటర్సిటీ మరియు రాత్రి 8 గంటలకు ఎక్స్ ప్రెస్ పేరుతో ప్రతిరోజు రెండు రైళ్లు వెళ్లే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించగలరని మీ పేరు స్థిర స్థాయిగా నిలిచిపోతుందని అనేకమంది ప్రయాణికుల తరపున నిత్యము రాజధానికి వెళ్లే ప్రజల తరపున తమరి దృష్టికి తెస్తున్నామని బతుకన్న గారు ఎంపీ గారికి వినతిపత్రం సమర్పించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బతుకన్నగారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ మొదలగు వారు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు మరో అడ్డా

## నంద్యాలలో వన్ స్టాప్ సెంటర్ శంకుస్థాపన



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 05 - నంద్యాల జిల్లాలో మహిళల రక్షణ, సహాయం, పునరావాసానికి కొత్త దిశగా అడుగుపెట్టి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న "వన్ స్టాప్ సెంటర్" భవనానికి బుధవారం శంకుస్థాపన జరిగింది.రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి కలిసి నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో రూ. 60 లక్షలతో నిర్మించనున్న సెంటర్‌కు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ?"దేశవ్యాప్తంగా మహిళల రక్షణ కోసం ప్రభుత్వం వన్ స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. నంద్యాల కూడా ఆ జాబితాలో చేరడం గర్వకారణం," అని అన్నారు.జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ?"ఈ సెంటర్ ద్వారా బాధిత మహిళలు, బాలికలకు ఆరోగ్య సేవలు, చట్టసహాయం, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సలహా, తాత్కాలిక వసతి ? ఇలా ఐదు రకాల సేవలు ఒకే చోట అందిస్తాం," అని తెలిపారు.బాధితులకు తక్షణ సహాయం, రక్షణ, వైద్య సదుపాయం కల్పించడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.ఆ సందర్భంగా మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి బాధిత మహిళల రవాణా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అధికారి లీలావతి, జిల్లా అధికారులు, మహిళా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వజన ఆసుపత్రిలో చెత్త చెదారం

## రోగులకు దుర్వాసనతో ఇబ్బందులు




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబరు 05:నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో చెత్త చెదారం పేరుకుపోవడంతో రోగులు, బంధువులు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి భవనం వెనుకభాగంలో ఉంచిన మూడు పెద్ద చెత్త డ్రమ్ములు పూర్తిగా నిండి, పక్కనే చిందరవందరగా చెత్త పేరుకుపోయింది. దాంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో దుర్భరంగా మారింది.రోగాల బారిన పడినవారు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తే, ఇక్కడి దుర్గంధం వల్ల మరిన్ని రోగాలు వస్తాయేమోనని భయపడుతున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఇలా చెత్త పేరుకుపోవడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు."ప్రభుత్వ ఆసుపత్రి అంటే ప్రజల ప్రాణాలను రక్షించే స్థలం. కానీ ఇక్కడ చెత్త కారణంగా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఇక్కడి వాసన తట్టుకోలేనంతగా ఉంది. రోజూ ఇక్కడికి వచ్చే రోగులు, సిబ్బంది, అటెండర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు స్థానికులు మాట్లాడుతూ ? ఆసుపత్రి ప్రాంగణం ఇలా ఉంటే సాధారణ ప్రజలకు ఏం సందేశం వెళ్తుంది అని ప్రశ్నిస్తున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు, ఆసుపత్రి నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, చెత్తను తొలగించి పరిశుభ్రతను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

# విద్యార్థుల భద్రతకు రాజీపడరాదు – రవాణా శాఖ స్పష్టం

**విద్యాసంస్థల యాజమాన్యాలతో రవాణా శాఖ సమీక్షా సమావేశం**

విభారె న్యూస్ నంద్యాల మా నవంబర్ 05 :-రవాణా కమిషనర్ వారి ఆదేశాల మేరకు, నంద్యాల పట్టణ పరిధిలోని విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులతో జిల్లా రవాణా శాఖ అధికారి జి.వి. శివారెడ్డి గారు మరియు ఉప జిల్లా విద్యా అధికారి శంకర్ ప్రసాద్ గారు కలిసి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి జి.వి. శివారెడ్డి మాట్లాడుతూ ?"విద్యార్థుల భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదు. విద్యాసంస్థలకు చెందిన బస్సులు, వ్యాన్లు నడపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలి. వాహనాల్లో అవసరమైన భద్రతా పరికరాలు తప్పనిసరిగా అమర్చాలి. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకునే విధంగా డ్రైవర్లు, అటెండర్లు అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు.ఉప జిల్లా విద్యా అధికారి శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ ?"విద్యాసంస్థల యాజమాన్యం రవాణా శాఖ సూచనలను కచ్చితంగా అమలు చేయాలి. విద్యార్థులను పాఠశాలకు సురక్షితంగా రవాణా చేయడం, తిరిగి వారి గమ్యస్థానాలకు భద్రంగా చేర్చడం పూర్తిగా యాజమాన్య బాధ్యత" అని అన్నారు.ఈ సమావేశంలో మోటార్ వాహన తనిఖీ అధికారి జి. శ్రీకాంత్, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారి జి. సుబ్బయ్య, అలాగే నంద్యాల పట్టణంలోని వివిధ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**